# భూముల వేలం అనివార్యమే..!

## రియల్ మార్కెట్‌పై హెచ్‌ఎండీఏ మల్లగుల్లాలు

పలు వెంచర్లలో మిగిలిన ప్లాట్ల వేలానికి కసరత్తు
భూముల వేలంతో కనీసం
రూ.3 వేల కోట్ల రెవెన్యూపై అంచనాలు



సిటీబ్యూరో, జనవరి 11(నమస్తే తెలంగాణ): మార్కెట్ బాలేదు. కొనుగోళ్లు జరగడం లేదు. భవన నిర్మాణ అనుమతుల్లో కదలిక లేదు. ఇలాంటి పరిస్థితుల్లో భూముల వేలంపై హెచ్‌ఎండీఏ అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. ఒకప్పుడు ఎకరం రూ.వంద కోట్లకు అమ్ముడైన సందర్భం నుంచి... కనీసం రీసేల్ ప్లాట్లను విక్రయించుకునే వెసులుబాటు లేకుండా పోయింది. ఇలాంటి సందిగ్ధ పరిస్థితుల నడుమ విలువైన భూముల ద్వారా రెవెన్యూ తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు హెచ్‌ఎండీఏ కూడా భూముల వేలానికి కసరత్తు చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత రియల్ ఎస్టేట్ రంగంలో స్తబ్ధత నెలకొంది. బిల్డింగుల నిర్మాణం నుంచి కొత్త లే అవుట్ల వరకు బిల్డర్లు మొగ్గుచూపడం లేదు. అనుమతులు తీసుకుంటున్నా... వాటి నిర్మాణ పనులను వాయిదా వేసుకుంటున్నారు. ఓవైపు పరిమితుల విధానంలో హెచ్ఎండీఏ కమిషనర్ సంస్కరణలు తీసుకువచ్చినా... పడుకున్న మార్కెట్ పరుగులు పెట్టే పరిస్థితి లేకుండా పోయింది. ఇలాంటి విరుద్ధమైన పరిస్థితుల్లో భూముల వేలం అనివార్యంగా మారినట్లుగా తెలుస్తోంది.

### మిగిలిపోయిన ప్లాట్లకు వేలం

గడిచిన నాలుగేళ్లలో విక్రయించిన లే అవుట్లలో మిగిలిపోయిన ప్లాట్లకు వేలం నిర్వహించాలని హెచ్‌ఎండీఏ భావిస్తోంది. కోకాపేట్ నియో పోలిస్, ఇతర లే అవుట్ల ద్వారా హెచ్‌ఎండీఏకు గతంలో సమకూరిన ఆదాయం నేపథ్యంలో.. ఆ స్థాయిలో రెవెన్యూ రాకపోయినా... కనీస అంచనాగా రూ.3 వేల కోట్లు వచ్చినా చాలని భావిస్తున్నారు. ఈ క్రమంలో కోకాపేట్ భూముల్లో 24 ఎకరాలను డెవలప్ చేస్తోండగా, బంజారాహిల్స్, బుద్వేల్, వంటి కీలకమైన ప్రాంతాల్లోని ప్లాట్లతో కలిపి వేలం వేయనున్నారు.

### తొలగని స్తబ్ధత...

గత ప్రభుత్వం తరహాలో నగరంలో భూముల వేలం నిర్వహించి.. పరిశ్రమలో నెలకొని ఉన్న స్తబ్ధతను తొలగించాలని భావిస్తోంది. ఈ క్రమంలో తక్కువ విస్తీర్ణంలోనే ల్యాండ్ పార్శిళ్లకు వేలం నిర్వహించడం ద్వారా మార్కెట్ ప్రస్తుత పరిస్థితితో పాటు రెవెన్యూ సమకూరుతుందని భావిస్తున్నారు. కానీ, గత ప్రభుత్వం తరహాలో వేలానికి ముందు రియల్ ఎస్టేట్ రంగానికి అనుకూలమైన నిర్ణయాలు, అందుకు అవసరమైన మౌలిక వసతులు, పరిసరాల్లో పరిశ్రమల ఏర్పాటుతో ఆయా భూములకు విపరీతమైన డిమాండ్‌ను తీసుకు రావడంపై కాంగ్రెస్ ప్రభుత్వం దృష్టి పెట్టడం లేదు. ఎంత సేపు వివాదస్పద నిర్ణయాలకు ప్రాధాన్యతనివ్వడంతో మార్కెట్ అస్థిరత కొనసాగుతనే ఉంది. దీంతో పాటు ప్రభుత్వం కూడా హైడ్రా వంటి విధానాలను తొందర పాటు అమలు చేయడం కూడా మార్కెట్‌లో మరింత అలజడికి కారణమైంది. ఇక మూసీ పేరిట కూల్చివేతలు, ఇప్పటికీ కొనసాగుతున్న నిర్మాణ కూల్చివేతలతో మార్కెట్ నిలబడే పరిస్థితి కనిపించడం లేదు. దీంతో గడిచిన ఏడాది కాలంగా నగరంలో రియల్ క్రయ విక్రయాల్లో ఆశించిన పురోగతి లేకుండా పోయింది. గతంలో హైదరాబాద్ శివారులో ఏర్పడిన వెంచర్లలో ఓపెన్ ప్లాట్లలను కొనేందుకు ఆసక్తి చూపేవారు. శని, ఆదివారాల్లో నిత్యం నగరానికి వచ్చే సంఖ్య వేలల్లో ఉండేదని పలువురు వ్యాపారులు పేర్కొంటున్నారు.

## చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలి

చేనేత కార్మిక సంఘం తెలంగాణ గౌరవ అధ్యక్షుడు టి.వెంకట్రాములు



హిమాయత్‌నగర్, జనవరి 11: రాష్ట్రంలో సహకార వ్యవస్థను మరింత పటిష్టం చేసేందుకు చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు టి.వెంకట్రాములు శనివారం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆలస్యంగానైనా చేనేత అభయహస్తం పథకం అమలుకు విధి విధానాలు రూపొందించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని స్వాగతిస్తున్నామని తెలిపారు. చేనేత పరిశ్రమ అభివృద్ధికి కార్మికుల సంక్షేమం కోసం రూ.1000 కోట్ల నిధులతో సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి, అన్ని రకాల రుణాలను మాఫీ చేయడం, దీంతో పాటు నేతన్నల కూలీ రేట్లు పెంచాలని డిమాండ్ చేశారు.

# హైకోర్టును రేస్ కోర్సు మైదానానికి మార్చాలి

పలువురు హైకోర్టు న్యాయవాదులు



సమావేశంలో హైకోర్టు న్యాయవాది మామిడి వేణు మాధవ్ తదితరులు

చిక్కడపల్లి, జనవరి 11: హైకోర్టును రాజేంద్రనగర్‌కు మార్చవద్దని, హైకోర్టును మలక్‌పేట్‌లోని రేస్ కోర్సు మైదానానికి మార్చాలని పలువురు హైకోర్టు న్యాయవాదులు అన్నారు. హైకోర్టు పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయవాది మామిడి వేణు మాధవ్ మాట్లాడుతూ, హైకోర్టు మార్చడం వెనుకొక పెద్ద కుట్ర కోణం దాగి ఉందన్నారు. 100 ఎకరాలు హైకోర్టుకు కేటియించినట్లు చేసి అగ్రికల్చర్ యూనివర్సిటీని రాజేంద్రనగర్ నుంచి ఎత్తివేసే ప్రయత్నం జరుగుతుందని చెప్పారు. 100 ఎకరాల్లో 40 ఎకరాలు బయో డైవర్సిటీ పార్క్, 10 ఎకరాల చెరువు ఉన్నదని, వాటిని నాశనం చేసి హైకోర్టు భవనం కట్టడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ ప్రతిపాదనను వెనక్కి తీసుకోవాలన్నారు. కొత్తగా కోర్టు నిర్మిచాలని ఉంటే మలక్‌పేట్‌లోని రేస్ కోర్సు మైదానానికి మార్చాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బార్ కౌన్సిల్ సభ్యులు ఫణీంద్ర భార్గవ్ మాట్లాడుతూ, కొందరు స్వార్థపర న్యాయవాదుల వలన హైకోర్టు మారుస్తున్నారని మండిపడ్డారు. హైకోర్టు న్యాయవాది భానుమూర్తి, న్యాయవాది బర్ల మల్లేశ్ మాట్లాడారు. సమావేశంలో న్యాయవాదులు రామకృష్ణ కులకర్ణి, కటకం శారద, న్యాయవాదులు దొంతు లక్ష్మీనారాయణ, న్యాయవాదులు గంజి యాదగిరి, నర్సింగ్ రావు, విజయసారథి, నవీన్, విశ్రాంత జిల్లా జడ్జి పాటిల్, ఆర్టీఐ ఉద్యమకారుడు విజయ్ గోపాల్, మంచాల లక్ష్మణ్, రంజిత్, కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన మహిళా శక్తి క్యాంటీన్ మేనేజ్‌మెంట్ శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

శేరిలింగంపల్లి, జనవరి 11: గచ్చిబౌలిలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్(నిథిమ్), తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ రూరల్ డెవలప్‌మెంట్ల సంయుక్త ఆధ్వర్యంలో సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ(ఎస్ఈఆర్పీ) సౌజన్యంతో నిర్వహిస్తున్న మహిళా శక్తి క్యాంటీన్ ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ శిక్షణ 6వ బ్యాచ్ ముగింపు కార్యక్రమం నిథిమ్‌లో శనివారం నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాలకు చెందిన 24 మంది మహిళలు ఈ శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్నారు. వివిధ రకాల రైస్ వంటకాలతో పాటు పలు రకాల స్నాక్స్, స్వీట్స్, బేకరీ ఉత్పత్తులు, కూరలు, బిర్యానీ వంటి వంటకాల తయారీలో మహిళలు ఈ కార్యక్రమంలో భాగంగా 10 రోజుల పాటు శిక్షణ పొందారు. శనివారం ఈ కార్యక్రమం ముగింపు సందర్భంగా శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పావర్టీ డైరెక్టర్ జాన్సన్ ముఖ్య అతిథిగా హాజరై బహుమతులు అందజేశారు. నిథిమ్ ప్రిన్సిపాల్ గణేశ్, చెఫ్‌లు మహేశ్, తుల్జారాంలతో పాటు పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ఆకట్టుకున్న కూచిపూడి ప్రదర్శన

కొండాపూర్, జనవరి 11: మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న గాంధీ శిల్ప బజార్, సంక్రాంతి సంబురాలలో భాగంగా శనివారం పలు సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో మేళ్ల చెరువు కామేశ్వరి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలతో అలరించారు. అడుగులు, జతులు, శివాష్టకం, కోలాటం, అష్ట లక్ష్మి, పరులన్న మాట, ఇతడొక్కడే, కన్నడ జతి స్వరం అంశాలను కళ్యాణి, శ్రావణి, జెష్మిత, మోక్ష, సాత్విక, దీత్య, నమిత, మనోజ్ఞ, వార్షిత, వైష్ణవిలు కూచిపూడి నృత్య రూపకంలో నర్తించిన తీరు ఆద్యంతం ఆకట్టుకున్నాయి.

## అలరించిన నాట్య మయూరాలు



నృత్య ప్రదర్శనలతో అలరిస్తున్న కళాకారులు

మాదాపూర్, జనవరి 11: కళాకారులు నాట్య ప్రదర్శనతో అలరించారు. మాదాపూర్‌లోని అన్నమాచార్య భావనా వాహినిలో పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు ఆధ్వర్యంలో ఆంధ్ర నాట్య కళాకారులచే నాట్య ప్రదర్శన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆర్కే డ్యాన్స్ అకాడమీ నృత్య గురువు ఉల్పన రఘుతో పాటు వారి శిష్య బృందం అమేయ, దీక్షిత, ఇషాన్వి, సీకల, తనుశ్రీ, ధ్రుతి, శ్రీనిధి సంయుక్తంగా కుంభ హారతి, పుష్పాంజలి, పేరిణి కౌతం, మూషిక వాహన, పద్యం, నల్లనివాడు పద్యం, నరయ తీర్థుల తారంగం, నేనే జాణ, శివ కైవారం, అడివచ్చే చెలియ, దండ మొక్కటి నీకు, ముత్యాల హారతి వంటి ప్రఖ్యాత సంకీర్తనలకు నృత్య ప్రదర్శనలు చేసి అలరించారు. అనంతరం, పద్మశ్రీ, డాక్టర్ శోభరాజు కళాకారులకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలను గావించారు.

# స్వతంత్ర పోరులో ఓబన్న పాత్ర చిరస్మరణీయం

ఘనంగా వడ్డే ఓబన్న జయంతి వేడుకలు



సిటీబ్యూరో, జనవరి 11(నమస్తే తెలంగాణ): స్వాతంత్ర పోరాటంలో వడ్డే ఓబన్న పాత్ర చిరస్మరణీయమని హైదరాబాద్ అదనపు కలెక్టర్ కదిరవన్ అన్నారు. కలెక్టరేట్‌లో ఓబన్న జయంతి వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. ఆయన చిత్రపటానికి కలెక్టర్‌తో పాటు పలువురు అధికారులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కదిరవన్ మాట్లాడుతూ, వడ్డె ఓబన్న, ఉయ్యాలవాడ నరసింహారెడ్డికి వ్యక్తిగత సైనికుడిగా ఉన్నారని తెలిపారు. బ్రిటీష్ వారిపైన జరిపిన పోరాటం గొప్పదని కొనియాడారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖాధికారి ఆర్.కోటాజి, బీసీ సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఆశన్న తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ నూతన విద్యా విధానం ప్రమాదకరం

ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కలపల్లి శ్రీనివాస్ రావు



ఏఐఎస్ఎఫ్ ఆఫీస్‌లో కర పత్రాలను ఆవిష్కరిస్తున్న నేతలు

హిమాయత్‌నగర్, జనవరి 11: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జాతీయ నూతన విధానం ప్రజాస్వామ్య, రాజ్యాంగ విలువలకు ప్రమాదకరమని, ఈ విధానం రద్దు కోసం ఉద్యమించాలని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ అధ్యక్షుడు తక్కలపల్లి శ్రీనివాస్ రావు విద్యార్థులకు పిలుపునిచ్చారు. ఫిబ్రవరి9, 10 తేదీల్లో నగరంలో నిర్వహించే ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సమావేశాలకు సంబంధించిన కర పత్రాలను హిమాయత్‌నగర్‌లోని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో నూతన విద్యావిధానం పేరుతో యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని దెబ్బ తీసే ప్రయత్నాన్ని కేంద్రం చేస్తుందని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి 10 శాతం నిధులు కేటాయించకపోవడంతో పాటు ప్రభుత్వ విద్య వ్యవస్థను ధ్వంసం చేసేందుకు మోదీ కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఈ జాతీయ సమావేశాల్లో విద్యారంగ సమస్యలపై చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎన్.స్టాలిన్, రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పుట్ట లక్ష్మణ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గ్యార క్రాంతి, నేతలు వంశీ వర్ధన్ రెడ్డి, ఎండి అన్వర్, హరీశ్, అరుణ్ పాల్గొన్నారు.

## ఏఎన్ఎంల సమస్యలను పరిష్కరించాలి

ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి నరసింహ



ఎస్ఎన్ రెడ్డి భవన్‌లో మాట్లాడుతున్న నరసింహ

హిమాయత్‌నగర్, జనవరి 11: రాష్ట్ర వ్యాప్తంగా ఎన్‌హెచ్ఎం స్కీంలో విధులు నిర్వహిస్తున్న ఆర్‌బీఎస్‌కే ఏఎన్ఎంలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ డిమాండ్ చేశారు. హిమాయత్‌నగర్‌లోని ఎస్ఎన్‌రెడ్డి భవన్‌లో ఏఎన్ఎంల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత కొన్నేండ్లుగా కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో చాలీ చాలని వేతనాలు తీసుకుంటూ ఏఎన్ఎంలు పని చేస్తున్నారని తెలిపారు. ఏఎన్ఎంల భర్తీ కోసం ఇటీవల ప్రభుత్వం పరీక్ష నిర్వహించిందని, అందులోనే మరిన్ని పోస్టులు పెంచి నియామకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేసే ఏఎన్ఎంలు కొంత మంది వయస్సు రీత్యా ఉద్యోగాలు పొందలేని పరిస్థితి ఉందని వారికి లైఫ్ టైం గ్రాట్యుటీ, హెల్త్ కార్డు, లైఫ్ ఇన్సూరెన్స్ వంటి సౌకర్యాలను కల్పించాలని కోరారు.



## బుద్ధ చిత్ర ప్రదర్శన

మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో కళాకారుడు ఆనంద్ గిరి ఏర్పాటు చేసిన 'బుద్ధిస్ట్' చిత్ర ప్రదర్శన శనివారం ప్రా రంభమైంది. ప్రదర్శనలో కళాకారుడు ఆనం ద్ వేసిన 70 చిత్రాలను ఈ నెల 16వ తేదీ వరకు ప్రదర్శించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. *– కొండాపూర్, జనవరి 11;*



మంత్రి శ్రీధర్ బాబుతో బ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

## విదేశీ విద్యలో పేద బ్రాహ్మణ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

మంత్రి శ్రీధర్‌బాబు

అంబర్‌పేట, జనవరి 11: విదేశీ విద్యను అభ్యసిస్తున్న పేద బ్రాహ్మణ విద్యార్థులకు త్వరలోనే స్కాలర్‌షిప్‌లను మంజూరు చేస్తామని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. బ్రాహ్మణులు రాజకీయంగా మరింతగా రాణించి పాలన, సేవా రంగంలో కీలక పాత్ర పోషించాలని చెప్పారు. తన కార్యాలయంలో బ్రాహ్మణ అఫీషియల్స్ అండ్ ప్రొఫెషల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ డైరీని రాష్ట్ర మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ సుశీల్ కుమార్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నీలకంఠం, ప్రధాన కార్యదర్శి వింజమూరి సుధాకర్, ప్రతినిధులు సీతారాం, పీవీ రాంచందర్ రావు, వేదాంతం పవన్ కుమార్, పి.సీతారామయ్య, రాఘువేందర్‌రావు, నాగేందర్, వైద్యనాథ్, పవన్‌కుమార్, మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు యమునా పాఠక్, అనూరాధ, డాక్టర్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## టోక్యో వర్సిటీలో గోల్డెన్ శలాక పోటీలు



సిటీబ్యూరో, జనవరి 11(నమస్తే తెలంగాణ): టోక్యో యూనివర్సిటీలో శలాక పోటీలను ఆచార్య బాలకృష్ణ ప్రారంభించారు. అమెరికాకు చెందిన ఫిలాసఫీ విభాగంలో ఆధ్వర్యంలో వీటిని శలాక పోటీలను నిర్వహిస్తున్నట్లుగా తెలిపారు. యోగా, వేదాల వంటి అతి ప్రాచీన గ్రంథాలను పరిరక్షించడమే లక్ష్యంగా కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. సనాతన యూనివర్సిటీ వ్యవస్థాపకులు ఆచార్య బాలకృష్ణ మాట్లాడుతూ, సనాతన ధర్మ పరిరక్షణలో ఈ గ్రంథాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు పునాది లాంటి ప్రాచీన సాహిత్యాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

## గొల్ల గట్టును రాష్ట్ర పండుగగా గుర్తించాలి

గొల్ల గట్టు సాంస్కృతిక చరిత్రపై సదస్సులో పలువురు వక్తలు



సదస్సులో అభివాదం చేస్తున్న అతిథులు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 11: ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థుల ఆధ్వర్యంలో గొల్లకట్టు సాంస్కృతిక చరిత్రపై శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు వక్తలుగా ప్రొఫెసర్ కంచె ఐలయ్య షెఫర్డ్, ప్రొఫెసర్ సింహాద్రి, డాక్టర్ రామ్ బీనవేణి షెఫర్డ్, రాజకీయ నాయకులు వట్టె జానయ్య యాదవ్, క్యామ మల్లేశ్, గడ్డం శ్రీనివాస్ యాదవ్ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గొల్ల గట్టు లింగమంతుల జాతరను రాష్ట్ర పండుగగా గుర్తించాలని డిమాండ్ చేశారు. జాతర సమయంలోనే పరిమితమైన నిధులు కాకుండా అధిక నిధులు కేటాయించి సంవత్సరం పొడుగునా మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. జాతరకు పూర్తి కాల చైర్మన్, కమిటీ ఏర్పాటు చేయాలని కోరారు. గొల్లగట్టు జాతరపై అగ్రవర్ణాలు చేస్తున్న కుట్రలు మానుకోవాలని హితవు పలికారు. యాదవులు, ఆశ్రిత కులాలైన బైకాని వారిని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. వారికి ప్రభుత్వం వేతనాలు చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.

## యమధర్మ రాజ శతకం గ్రంథావిష్కరణ




గ్రంథాన్ని ఆవిష్కరించిన జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు

ముషీరాబాద్, జనవరి 11: చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో జరుగుతున్న ఎందరో మహానుభావులు మధుర స్మృతలలో భాగంగా శనివారం హాస్యబ్రహ్మ శంకర నారాయణ రచించిన యమధర్మ రాజ శతకం గ్రంథావిష్కరణ జరిగింది. ఈ కార్యక్రమంలో జస్టిస్ కాశీ విశ్వేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని యమధర్మ రాజ శతకాన్ని ఆవిష్కరించారు. అనంతరం, ఆయన మాట్లాడుతూ, చాలా వరకు శతక పద్యాలు, సూక్తులు, హిత వచనాలు దేవతలను స్తుతిస్తూ వుంటాయని, కానీ, ప్రాణాలు తీసుకొని పోయే యముడి గురించి శతకం రాయటం విశిష్టమని అన్నారు. యమునిపై చతురతతో పద్యాలు రాసి పాఠకులకు అందించడం అభినందనీయమన్నారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రచయిత రామారావు విశ్వేశ్వర రావు, ప్రొఫెసర్ నందం సాంబశివరావు, నటుడు జంగయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కింగ్ ఫిషర్ బీర్లను నిషేధించాలి

స్వచ్ఛమైన నీరా, కల్లు ఉత్పత్తులను ప్రోత్సహించాలి
బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్



మాట్లాడుతున్న బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్

రవీంద్రభారతి, జనవరి 11: రెండు తెలుగు రాష్ట్రాలలో కింగ్ ఫిషర్ బీర్లపై నిషేధం విధించి ప్రజల ఆరోగ్యం, ఆర్థిక సంక్షేమం, ప్రాచీన సంప్రదాయాలను కాపాడటానికి స్వచ్ఛమైన కల్లు, నీరాల ఉత్పత్తులను ప్రోత్సహించాలని బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ రాచాల యుగంధర్ గౌడ్ రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం సమావేశంలో రాచాల యుగంధర్ గౌడ్ మాట్లాడుతూ నాణ్యమైన బీర్లను ఉత్పత్తి చేసే చిన్న కంపెనీలకు మార్కెట్లో నిలదొక్కుకోలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆ తల బిరుసుతోనే ఏకంగా ప్రభుత్వాలన్ని బెదిరించే స్థాయికి యూబీ గ్రూప్ వచ్చిందన్నారు. మాకు మిగలడంలేదని కంపెనీలు గగ్గోలు పెడుతున్నాయని, ఎక్కువ ఖర్చు లేకుండా తయారయ్యే బీరుకు 18 శాతం సరిపోవడంలేదని ప్రశ్నించారు. బ్లాక్ మెయిల్ చేసి, ధరలు పెంచేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తుందని, మార్కెట్‌లో అంతకంటే తక్కువ ధరకు ఎక్కువ నాణ్యమైన బీర్లు సరఫరా చేసే కంపెనీలు బోలెడు ఉన్నాయని, మోనోపోలి ఏర్పడటం వల్ల చాలా కంపెనీలు తెలంగాణలో అమ్మకాలు చేయలేకపోతున్నాయన్నారు. రాయితీలపై నడిచే కంపెనీలను బెదిరిస్తే చూస్తూ ఊరుకోబోమని, కంపెనీ ఒత్తిడితో ధరలు పెంచి, ప్రజలపై భారం మోపవద్దని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బేవరేజ్ కంపెనీలు మిలియన్ల నీటిని అక్రమంగా తీసుకెళుతున్నాయని, వాటిని వెంటనే ఆపాలన్నారు. కల్లు, నీరా వంటి సంప్రదాయ ఉత్పత్తులు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మేలుచేస్తాయని, ఆరోగ్యపరమైనవి మాత్రమే కాకుండా, గ్రామీణ ప్రజలకు ఉపాధి అవకాశాలు అందిస్తాయన్నారు. వీటిని ప్రోత్సహించడం వల్ల గ్రామీణ ప్రాంతాలు ఆర్థికంగా అభివృద్ధి చెందుతాయని రాచాల యుగేంధర్ గౌడ్ అన్నారు. కార్యక్రమంలో సొసైటీ ఫర్ సోషల్ ఆడిట్ చైర్మన్ గాలిగల్ల సాయిబాబా, వనం తరుపతయ్య యాదవ్, గుర్రం రాఘవేందర్ గౌడ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.